

ఎక్సైజ్ సీఐల నియామకం

విజయనగరం క్రైం, సెప్టెంబరు 29: జిల్లాలో వివిధ ఎక్సైజ్ స్టేషన్‌లకు సీఐలను నియమిస్తూ ఎక్సైజ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం టౌన్ సర్కిల్ సీఐగా కె.మన్మధరావు, రూరల్ సీఐగా ఎం.విజయలక్ష్మీ, భోగాపురం సర్కిల్ సీఐగా వి.రవికుమార్, చీపురుపల్లి సర్కిల్ సీఐగా సీహెచ్ చక్రవర్తి, నెల్లిమర్ల సీఐగా ఎం.వెంకటరావు, గజపతినగరం సీఐగా జె.జనార్ధనరావు, ఎస్.కోట సీఐగా సీహెచ్ రాజేష్, కొత్తవలస సీఐగా జి.రాజశేఖర నాయుడు, బొబ్బిలి సీఐగా పి.చిన్నంనాయుడు, రాజాం సీఐగా ఆర్‌జై భీమ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లెక్కలున్నాయి.. మొక్కలే లేవు

- అక్రమాల పుట్టగా జగనన్న పచ్చతోరణం
- రూ.10 కోట్ల వరకూ పక్కదారి
- గత ఐదేళ్లలో సంరక్షణ కరువు

మొక్కలు నాటడమే కాదు. వాటి సంరక్షణా బాధ్యతలు కూడా మనమే తీసుకోవాలి అంటూ గత ఐదేళ్లూ చెప్పుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో గుర్తించలేదు. మొక్క వేయకుండా వేసినట్లు.. పెంచకుండా పెంచినట్లు నేతలు చేసిన మాయలను పరిశీలనలోకి తీసుకోలేదు. నిధులు పక్కదారి పట్టినా చర్యలు చేపట్టలేదు. వెరసి జగనన్న పచ్చతోరణం అక్రమాల తోరణంగా మారింది. కొందరి జేబులు నింపే పథకంగా విమర్శలందుకుంది.

-విజయనగరం (ఆంధ్రజ్యోతి)



మెంటాడ మండలం పిట్టాడ వద్ద మొక్కల స్థానంలో పిచ్చి మొక్కలు



వంగర మండలం లక్ష్మీపేట గ్రామంలో మొక్కల కోసం తీసిన గోతులు(ఫైల్)

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో మొక్కల సంరక్షణ పేరిట కోట్లాది రూపాయలు గోల్‌మాల్ అయ్యాయి. పచ్చదనం పెంపు, పర్యావరణ సమతుల్యం, కాలుష్య నివారణ నినాదాలతో ఆ ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించింది. 'జగనన్న పచ్చతోరణం' పథకం కింద రహదారులకు ఇరువైపులా ఉపాధి హామీ పథకం నిధులతో మొక్కలు నాటింది. సంరక్షణా బాధ్యతలకు సైతం కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. కానీ ఐదేళ్లలో నాటిన చోట మొక్కలు మాత్రం కనిపించడం లేదు. అవి బతికే ఉన్నట్టు రికార్డుల్లో చూపుతూ వచ్చారు. పెద్ద మొత్తంలో నిధులు డ్రా చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక జగనన్న పచ్చతోరణం పథకాన్ని తెరపైకి తీసుకొచ్చింది. రోడ్డుకిరువైపులా మొక్కలు నాటించింది. 2019-20 నుంచి 2021-22 మధ్య జిల్లాలో అన్ని మండలాల్లో ఈ పథకాన్ని అమలుచేశారు. దాదాపు 2,200 కిలోమీటర్ల మేర 8,81,414 మొక్కలు నాటినట్టు చెబుతున్నారు. కేవలం వాటి సంరక్షణకే రూ.10 కోట్లు వెచ్చించారు. ఇంత ఖర్చు చేసినా ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు. కనీసం వాటి ఆనవాళ్లు తెలియడం లేదు. వాస్తవానికి సరిగ్గా నిర్వహణ చేపడితే 85 శాతం మొక్కలు బతకాలి. ఒక వేళ మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తవాటిని నాటాలి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అటవీ శాఖ నర్సరీల నుంచి 1.06 లక్షల మొక్కలు తెచ్చారు. మిగిలిన వాటిని ప్రైవేటు నర్సరీల నుంచి సేకరించారు. ఇలా మొక్కల కొనుగోలు, ట్రీగార్డులు, వాటి సంరక్షణకు ఏడాదిలో రూ.4.90 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు.

ఇలా చెల్లించారు..

ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టారు. ఒక్కో మొక్క కోసం గొయ్యి తీసేందుకు రూ.52.90, రవాణాకు రూ.3, అంతర్గత రవాణాకు రూ.2.30, నాటేందుకు రూ.9.12, కంచె కట్టేందుకు రూ.140లు ఖర్చు చేసినట్టు చూపించారు. ఎరువు వేసేందుకు, నీళ్ల పోసేందుకు అదనపు ఖర్చులు చూపారు. రోడ్డు విస్తరణ చేపట్టిన చోట సైతం మొక్కలు నాటామని లెక్కల్లో పేర్కొనడం విశేషం. జిల్లాలో జాతీయ రహదారి-516 నిర్మాణంలో ఉన్న సంగతి తెలిసిందే. ఆ రహదారి పొడవునా గంట్యాడ మండలం కొర్లాం, కొండ తామరాపల్లి, తాటిపూడి ప్రాంతాల్లో వేలాది మొక్కలు నాటామని, రోడ్డు విస్తరణ పనుల్లో అవన్నీ కొట్టుకు పోయాయని రికార్డుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొక్కల కొనుగోలు, సంరక్షణ పేరిట రూ.2 కోట్లు పక్కదారి పట్టాయని కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. అయితే క్షేత్రస్థాయిలో రూ.10 కోట్ల నిధులు గోల్‌మాల్ అయినట్టు తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశముంది.

కాసులే కాసులు..

జగనన్న పచ్చతోరణం పథకం అప్పటి యంత్రాంగానికి కాసులు కురిపించింది. మొక్కల కొనుగోలు సమయంలో భారీ అవినీతి జరిగింది. ఈ బాగోతంలో కింది స్థాయి సిబ్బంది నుంచి జిల్లా అధికారుల వరకూ భాగస్వామ్యం ఉంది. వాస్తవానికి ఆరు అడుగుల ఎత్తు, రెండేళ్ల వయసున్న మొక్కలనే నాటాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఎక్కడా ఆ పొడవు ఉన్న మొక్కలను నాటలేదు. 3 నుంచి 4 అడుగుల పొడవు ఉన్న మొక్కలను కొనుగోలు చేసి నాటారు. ఆరు అడుగుల మొక్కలను కొనుగోలు చేసినట్టు చూపారు. ఒక్కో మొక్క రూ.98కి కొనుగోలు చేసినట్టు చెప్పినప్పటికీ రూ.20 చొప్పున కమీషన్ తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాకు క్రీడా పాఠశాల

- కబడ్డీ, ఖోఖో అకాడమీల ఏర్పాటు
- శాప్ ఎండీ గిరీశ

విజయనగరం టౌన్/ రూరల్, సెప్టెంబరు 29: జిల్లాలో క్రీడా పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఎండీ పీఎస్ గిరీశ అన్నారు. జిల్లా పర్యటనకు ఆదివారం వచ్చిన ఆయన పట్టణ శివారు విజ్జీ స్టేడియంలో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం సిద్ధం చేయడానికి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూ. 10 లక్షలు మంజూరు చేశారని, ఆ నిధులతో పనులు దాదాపు పూర్తయ్యాయని, పైడితల్లి అమ్మవారి పండగ నాటికి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ వివరించారు. వచ్చే నెల 10లోగా పనులు పూర్తి చేసి అప్పగించాలని ఇంజనీర్లను ఆదేశించారు. అలాగే స్టేడియంలో బాక్సింగ్ రింగ్‌కు అవసరమైన పరికరాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ నుంచి తరలించిన క్రీడా పాఠశాలను తిరిగి ప్రారంభిస్తామని, అలాగే కబడ్డీ, ఖో- ఖో అకాడమీలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావును ఆయన ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా జెడ్పీ అతిథిగృహానికి చేరుకున్న శాప్ ఎండీ గిరీశకు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డీఎస్‌డీవో జూన్ గాలియట్, సీపీడబ్ల్యు ఇంజినీర్ శ్రీనివాస్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి పి.సీతారామరాజు, టీడీపీ సీనియర్ నాయకులు పూసపాటి రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అదితితో చర్చిస్తున్న శాప్ ఎండీ గిరీశ

- శాప్ ఎండీ పీఎస్ గిరీశ ఆదివారం ఉదయం చదురుగుడిలో పైడిమాంబను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు.

విజయనగరం ఉత్సవాల్లో మా పాత్రేది?

ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉత్సవ కమిటీ శాశ్వత సభ్యులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్: త్వరలో జరగనున్న విజయనగరం ఉత్సవాల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఉత్సవ కమిటీ శాశ్వత సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను మొక్కుబడి పాత్రకే పరిమితం చేస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. విజయనగరం ఉత్సవాలు 2002లో ప్రారంభమయ్యాయి. అప్పట్లో రూ.10 వేలు చెల్లించి ఉత్సవాల కమిటీ శాశ్వత సభ్యులుగా 12 మంది చేరారు. 2015లో మరికొంత మంది సభ్యులుగా చేరారు. పాతవారితో కలుపుకుంటే ప్రస్తుతం 37 మంది ఉన్నట్టు సమాచారం. ఉత్సవాలు నిర్వహించే సందర్భంలో జరిగే ప్రతి సమావేశానికీ కమిటీ శాశ్వత సభ్యులను పిలిచి వారి అభిప్రాయాలను తీసుకోవడమే కాకుండా, సంస్కృతిక వేదికల వద్ద వీరు జిల్లా అధికార యంత్రాంగానికి సహకారంగా ఉంటారు. 2003లో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. ఆ తరువాత కొన్ని సంవత్సరాలు విజయనగరం ఉత్సవాలు జరగలేదు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వరుసగా నాలుగేళ్ల విజయనగరం ఉత్సవాలు నిర్వహించారు. ఆ తరువాత 2019 నుంచి 2024 వరకూ విజయనగరం ఉత్సవాలను వైసీపీ హయాంలోనూ నిర్వహిస్తూ వచ్చారు. అయితే ఉత్సవాల్లో శాశ్వత సభ్యులకు ఆహ్వానాలు అందినా వీరి సేవలను అంతగా వినియోగించుకోవడం లేదు. పైగా వైసీపీ సానుభూతిపరులకు గతంలో పెద్దపీట వేశారు.. ప్రస్తుతం విజయనగరం ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కలెక్టర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో మూడు సమావేశాలు నిర్వహించగా కేవలం ఒకే ఒక్క సమావేశానికే శాశ్వత సభ్యులను ఆహ్వానించారు. దీనిని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది విజయనగరం ఉత్సవాలు వచ్చేనెల 13, 14న జరగనున్నాయి. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది.



బోగస్ పింఛన్లపై గురి

- ప్రక్షాళనకు ప్రభుత్వ కార్యాచరణ
- కొత్త పింఛన్లకు అక్టోబర్‌లో దరఖాస్తుల స్వీకరణ



మెంటాడ, సెప్టెంబరు 29: పింఛన్ల లబ్ధిదారుల్లో అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ త్వరలోనే ప్రారంభం కానుంది. గత ప్రభుత్వ హయాంలో పింఛను మంజూరుకు ఆరు అంచెల తనిఖీ నిబంధన పాటిస్తామని బయటకు చెప్పినే వైసీపీ నేతల సిఫార్సు మేరకు అనర్హులకు కూడా ఇబ్బడిముబ్బడిగా పింఛన్లు మంజూరు చేశారు. అదే సమయంలో పెద్ద సంఖ్యలో అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఉన్నప్పటికీ వీరికి పింఛన్ల మంజూరుకు మోకాలడ్డింది. దీనివల్ల ఎంతోమంది ఇబ్బందులు పడ్డారు. తాజాగా అర్హులైన అందరికీ పింఛన్లు అందాల్సిందేనని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియపై పూర్తి స్థాయిలో కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా అనర్హుల ఏరివేతపై దృష్టి పెట్టింది. పింఛన్ల తనిఖీకి ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నారు. ఆదాయపన్ను, రవాణా శాఖ, కేంద్ర సర్వీసులకు సంబంధించిన శాఖల నుంచి డేటా తెప్పించుకోవాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని డేటాను కూడా తీసుకోవాలని నిశ్చయించారు. ఆరు అంచెల తనిఖీ నిబంధనల ఆధారంగా అర్హులు, అనర్హులను నిర్ధారిస్తారు. వితంతువులు, ఒంటరి మహిళల్లో ప్రత్యేక విధానం ద్వారా అనర్హులను గుర్తిస్తారు. ఈ జాబితాను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తుంది. అర్హుల ఎంపికకు కొత్త విధానాన్ని రూపొందించనున్నారు. అంతిమంగా అర్హులు, అనర్హులు జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. అభ్యంతరాలుంటే తెలుపుకునే అవకాశం కల్పిస్తారు. మూడంచెల విధానంలో అభ్యంతరాల స్వీకరణ అనంతరం అర్హత ఉన్నవారు ఉంటే వారికి పింఛన్లు కొనసాగిస్తారు. మిగిలిన వారివి రద్దుచేస్తారు. కొత్తపింఛన్ల మంజూరుకు అక్టోబరులో దరఖాస్తులు స్వీకరించనున్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పింఛన్లు మంజూరు చేస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. కొత్త పింఛన్లకు వీరినుంచి కూడా దరఖాస్తులు తీసుకుంటారు. మొత్తమ్మీద గత ప్రభుత్వంలో పింఛన్లు పొందలేని అర్హులకు ప్రస్తుత ప్రభుత్వం తీపికబురు చెప్పిందనే భావించాలి. కొత్త పింఛన్లు డిసెంబరు లేదా సంక్రాంతి కానుకగా జనవరి నుంచి అందించే అవకాశముంది.

మాకే ఎందుకలా?

- వైద్య ఆరోగ్య శాఖ విధులతో పాటు వేరే పనులు అప్పగింత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఏఎన్‌ఎంలు
- వారం కిందట నిరసన

ప్రతి నెలా 25, 26 తేదీల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు సమీక్షలు నిర్వహిస్తారు. దీనికి ప్రతి ఏఎన్‌ఎం తప్పక హాజరుకావాలి. ఆ నెలలో చేసిన పనంతా రికార్డులతో సహా వైద్యాధికారులకు చూపించాలి. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆన్‌లైన్ చేసే బాధ్యతను మండల పరిషత్ అధికారులు ఏఎన్‌ఎంలకు అప్పగించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం అందించిన స్టిక్కర్‌ను వీరు అంటించాలి. ఇలా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన విధులతో పాటు వేరే పనులు చేయిస్తుండడంతో ఐదు రోజుల క్రితం సచివాలయ ఏఎన్‌ఎంలు కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. జేసీకి వినతిపత్రం అందజేశారు.

శృంగవరపుకోట, సెప్టెంబరు 29: ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్‌ఎంలకు మాత్రమే అప్పగిస్తున్నారు. దీనిని వీరు వ్యతిరేకిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అన్ని శాఖలకు సంబంధించిన ఉద్యోగులు వీటిల్లో పని చేసేలా చర్యలు తీసుకుంది. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియమించింది. ఏ శాఖ విధులు ఆశాఖకు అప్పగించడంతో పాటు అందరూ అన్ని శాఖల పనులు చేసేలా చర్యలు తీసుకుంది. అంతవరకు బాగున్నప్పటికీ వైద్య ఆరోగ్య శాఖకు భాగస్వామ్యం కల్పించడంతో సచివాలయం ద్వారా ఎంపికైన ఏఎన్‌ఎంలు పనిభారం ఎదుర్కొంటున్నారు.

అన్ని శాఖల పనులను సచివాలయ ఏఎన్‌ఎంలు చేయగలుగుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పనులను మిగిలి శాఖల సచివాలయ ఉద్యోగులకు అప్పగించడం లేదు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విధులు కావడంతో ఇతర శాఖల సచివాలయ ఉద్యోగులకు ఈ పనులు అప్పగించే సహసం వైద్యులు చేయలేకపోతున్నారు. నిత్యం చేయాల్సిన పనులతో పాటు వైద్య శాఖ కొత్తగా అమలుపరిచే పనులను ఈ శాఖ ఒక్కటే చక్కబెట్టుకుంటోంది. దీంతో తలకుమించిన పనిభారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. కొన్నిసార్లు ఒకే సమయంలో రెండు శాఖలు పని అప్పగిస్తుండడంతో ఓ శాఖ పని ముందు చేస్తే మరో శాఖ నుంచి చీవాట్లు తింటున్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్‌ఎంలు (ఫైల్)

'ప్రాథమిక ఆరోగ్య కేంద్రాధికారి ఆధ్వర్యంలో పనిచేస్తున్న మేము అన్ని జాతీయ కార్యక్రమాలతో పాటు గర్భం దాల్చిన సమయం నుంచి బిడ్డకు జన్మనిచ్చేవరకు బాలింతల ఆరోగ్యం కాపాడుతున్నాం. వ్యాధి నిరోధక టీకాలు అందిస్తాం. ఫ్రైడే, డ్రైడే, స్టాఫ్‌మీటింగ్, సెక్టార్ మీటింగ్, 104, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు వంటి పనులు చేస్తున్నాం. మరోవైపు మండల ప్రజా పరిషత్, మున్సిపల్ కమిషనర్‌లు పనులు చెబుతున్నారు. ఓ పక్క టీకాలను వేస్తూనే పది గంటలకు బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా పట్టించుకోలేదు. కనీసం కూటమి ప్రభుత్వమైనా వైద్యేతర పనులు అప్పగించకుండా చూడాలి.'

- గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్‌ఎంల ఆవేదన



గెడ్డవలస సమీపంలో తోటపల్లి కాలువలో నీటి గలగలలు

కాలువ చెంత.. సాగుకు చింత

- ఏడు గ్రామాల రైతుల సాగునీటి కష్టాలు
- కాలువకు పైభాగంలో పంట భూములు

రాజాం రూరల్, సెప్టెంబరు 29: తోటపల్లి సాగునీటి కాలువకు భూములిచ్చారు.. పక్కనే పంట కాలువ ఉంటే తమ భూములతో పాటు అనేక మంది రైతులకు భరోసా లభిస్తుందని భావించారు. తీరా చూస్తే వారి భూములకే చుక్క నీరందడం లేదు. రాజాం మండలంలోని బొమ్మినాయుడువలస, ఎంజె వలస, జీసీపల్లి పంచాయతీలతో పాటు వాటి పరిధిలోని బూరాడపేట, గెడ్డవలస, గొల్లలపేట, విజయరాంపురం గ్రామాల రైతుల దుస్థితిది. దశాబ్దానికి పైగా సాగునీటి కష్టాలు పడుతున్నారు. గ్రామాల మధ్య నుంచే తోటపల్లి కాలువలో జలసిరులు గలగలలాడుతూ ఉన్నా చుక్క సాగునీటికి నోచుకోవడం లేదు. కాల్వ తవ్వకం సమయంలో ఇంజినీరింగ్ అధికారులు ముందుచూపు లేకుండా వ్యవహరించడమే వారికి శాపమైంది. రెండు దశాబ్దాల క్రితం తోటపల్లి కాలువ నిర్మించారు. అయితే గ్రామాల పరిధిలో ఉన్న భూములు ఎత్తులో ఉండడం, కాల్వ నిర్మాణం పనులు దిగువన చేపట్టడంతో పొలాలకు సాగునీరు అందడం లేదు. ఫలితంగా వర్షాధారంపైనే రైతాంగం ఆధారపడుతోంది. పార్టీలకు అతీతంగా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

దిక్సూచి
DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

డిజిటల్ భారత్ నిధి

నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సమాచారమే ఇంధనం. అన్ని రంగాల్లో తారతమ్యాలు ఉన్నట్లే, సమాచార ప్రసారంలో కూడా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉన్నంత సమాచార వ్యాప్తి మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో ఉండటం లేదు. కారణంగా సమాచార సమ్మిళితత్వం కొరవడి విద్య, ఆర్థిక, సాంకేతికపరమైన అంతరాలు ఇంకా విస్తరిస్తున్నాయి. 'వన్ నేషన్ - వన్ మార్కెట్', 'ఈ-నామ్' వంటి ప్రభుత్వ సమ్మిళితాభివృద్ధి చర్యలు మారుమూల ప్రాంత రైతులు, చేతివృత్తుల వారు, వ్యాపారుల వరకూ చేరలేకపోతున్నాయి.

దీనికి కారణం ప్రైవేటు టెలికం ఆపరేటర్లకు పట్టణాల్లో ఉత్పన్నమయ్యే ఆదాయం గ్రామీణ ప్రాంతాల నుంచి లభించకపోవడం. జనసాంద్రత తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాలతో పోలిస్తే నిర్వహణ వ్యయాలు అధికంగా ఉండటం. అయితే, ప్రైవేటురంగం వెనకడుగు వేసిన సమయాల్లో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం ముందడుగు వేయాల్సి ఉంటుంది. ఈ నిమిత్తం బిఎస్ఎన్ఎల్ ఒక ప్రత్యామ్నాయంగా కొనసాగినప్పటికీ నిధులు, నిర్వహణాపరమైన సమస్యలతో కూనరిల్లుతోంది. ఈ నేపథ్యంలో సంస్థాగత మార్పుల ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా' ప్రణాళికలో భాగంగా 1885 నాటి 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని' రద్దుచేసి, 2023లో 'టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్'ను తీసుకువచ్చింది. టెలికాం రంగంలో పెట్టుబడులను విస్తరించడానికి, మారుమూల ప్రాంతాలకు కూడా టెలికం సేవలు విస్తరించి సమ్మిళిత సమాచార వ్యవస్థను రూపొందించడానికి టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్-2023లో 'డిజిటల్ భారత్ నిధి' ఏర్పాటును అంతర్భాగం చేశారు.

అయితే టెలికం రంగంలో ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు సేవలను విస్తరించేందుకు నిధుల సమీకరణ నిమిత్తం 2003లో ఏర్పాటు చేసిన 'యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్(యూఎస్ఓఎఫ్)' స్థానంలో ఈ డిజిటల్ భారత్ నిధిని తీసుకువచ్చారు.

యూఎస్ఓఎఫ్ రద్దుకు కారణాలు

ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్‌కు సవరణలు చేసి 2003లో ఈ 'యూఎస్ఓఎఫ్' నిధిని మారుమూల ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరించేందుకు పెట్టుబడులు జమ చేసే ప్రత్యేక నిధిగా రూపొందించారు.

టెలికాం ఆపరేటర్ల అడ్జెస్టెడ్ గ్రాస్ రెవెన్యూ(ఏజీఆర్-సవరించిన స్థూల ఆదాయం)పై 5 శాతం లెవీ విధించడం ద్వారా ఈ నిధికి వనరులు సమకూరేవి. అయితే ఈ నిధిని స్థాపించిన నాటినుంచి వనరుల అసమర్థ వినియోగం గురించిన విమర్శలను ఎదుర్కొంటూనే ఉంది.

2017-22 మధ్యకాలం చూసుకుంటే ఈ నిధికి రూ.41,740 కోట్లు జమ అవగా, ఖర్చు చేసిన మొత్తం మాత్రం రూ. 30, 213 కోట్లు (72 శాతం)గా ఉంది. ఈ నిధుల్లో అత్యధిక



భాగం గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలికాం అనుసంధానత విస్తరించడానికి 'భారత్ నెట్ ప్రాజెక్టు' ద్వారా వినిమయం చేయడానికి కేటాయించినా అవి పూర్తిస్థాయిలో వ్యయం చేయలేదు.

ఈ లోపాలను అధిగమించి, టెలికాం రంగంలో మరింత విస్తారమైన సేవలు, వినూత్న కార్యాచరణలు ప్రతిపాదిస్తూ 'డిజిటల్ భారత్ నిధి'కి రూపకల్పన చేశారు. ఈ నిధిని టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్ 2023, సెక్షన్ 24(1) ప్రకారం ఏర్పాటు చేశారు.

డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్)

యూఎస్ఓఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన ఈ డిజిటల్ భారత్ నిధి కార్యాచరణ పరిధిని మరింత విస్తరించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలీ కమ్యూనికేషన్స్ సేవలు విస్తరించడంతోపాటు, టెలీ కమ్యూనికేషన్‌కు సంబంధించిన సాంకేతికతలు, ఉత్పత్తుల అభివృద్ధికి, వివిధ రంగాల్లో పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ), పైలెట్ ప్రాజెక్టులకు, బలహీన వర్గాలు, వికలాంగులు, స్త్రీలు, స్వయం సహాయక సంఘాలు వంటి వారికి సహాయం చేసే పథకాలు/ప్రాజెక్టులకు ఈ నిధి నుంచి ఆర్థిక తోడ్పాటు లభిస్తుంది. అదేవిధంగా టెలికాం ఆపరేటర్ల నుంచి వసూలు చేసిన నిధులు(డీబీఎన్ నిధులు) టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్(2023) సెక్షన్ 25 ప్రకారం తొలుత సంఘటిత నిధికి జమ అవుతాయి. తదుపరి కేంద్రప్రభుత్వం ఆ నిధులను పార్లమెంటు ఆమోదంతో డీబీఎన్‌కి బదలాయిస్తుంది.

ఈ నిధికి సంబంధించి ప్రాధికార సంస్థ అయిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్' ఇటీవల డిజిటల్ భారత్ నిధి నిర్వహణ నియమావళిని విడుదల చేసింది. ఈ నిధిని నిర్వహించే అడ్మినిస్ట్రేటర్ నియామకం, విధులు, నిధి లక్ష్యాలను అమలుచేసే ఇంప్లిమెంటర్(అమలుదారు) ఎంపిక వంటి అంశాల గురించి విశదీకరించడం జరిగింది. ఈ నియమావళి ప్రకారం, కేంద్రప్రభుత్వం డిజిటల్ భారత్ నిధికి ఒక అడ్మినిస్ట్రేటర్‌ను నియమిస్తుంది. బిడ్డింగ్ లేదా నామినేషన్ ద్వారా అమలుదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం, వారిని సమయానుసారం పర్యవేక్షించడం, వివాదాల పరిష్కారం, నిధుల పంపిణీ, నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించడం, మూల్యాంకనం తదితర విధులను అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటాడు.

అమలుదారుల ఎంపిక ప్రాథమికంగా రెండు విధాలుగా ఉంటుందని నియమావళి సూచిస్తోంది. టెలీ కమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రమోషన్ కోసం అమలుదారులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. అదే పరిశోధన, అభివృద్ధి కోసం అయితే అప్లికేషన్ ఆధారిత ఎంపిక జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఆపరేటర్స్‌ను నామినేట్ చేసే విచక్షణాధికారాన్ని అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటారు. టెలీ కమ్యూనికేషన్స్ సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సేవలను మెరుగుపర్చడం, నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతల అభివృద్ధి, టెలీ కమ్యూనికేషన్స్ రంగంలో నవకల్పనలు, స్టార్టప్‌లు, పరిశోధనలకు మద్దతు ఇవ్వడం వంటి కార్యక్రమాలకు గాను అమలుదారుకు నిధులను కేటాయిస్తారు.

ఈ నిధులను అందరికీ ఒకే తరహాలో కాక, అమలుదారుల కార్యకలాపాలను ఆధారం చేసుకుని అడ్మినిస్ట్రేటర్ వారికి పూర్తిగా లేదా పాక్షికంగా కానీ, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, కో ఫడింగ్ తరహాలో నష్టభయాలను తగ్గించుకునేవిధంగా నిధుల కేటాయింపును నిర్ణయిస్తాడు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

డీబీఎన్ ద్వారా ఆశిస్తున్న ప్రయోజనాలు

1. సమాచార యుగం లో డిజిటల్ అంతరాలను రూపుమాపి, ప్రతీ ఒక్కరికీ సమాచార విప్లవ ఫలితాలు అందేలా డిజిటల్ సమ్మిళితత్వాన్ని తీసుకురావడం. తద్వారా ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించడం.
2. టెలికాం రంగంలో రాబోయే సరికొత్త తరం టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి వ్యవస్థాగత సంసిద్ధత, అవస్థాపన సౌకర్యాల అభివృద్ధి. ఉదాహరణకు ప్రస్తుతం పూర్తిస్థాయిలో 5జీ టెక్నాలజీని అందిపుచ్చుకునే సంసిద్ధత సాధించే లోపే 6జీ ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. 5జీ కన్నా వెయ్యిరెట్లు వేగవంతమైన 6జీని భారత్‌లో ప్రవేశపెట్టాలంటే మరింత మెరుగైన ఫైబర్ ఆప్టిక్ కేబుల్ వ్యవస్థ, అనుసంధానతలపరమైన నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతలను అభివృద్ధి పర్చుకోవాల్సి ఉంటుంది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి డీబీఎన్ నిధి సహకరిస్తుంది.
3. ప్రపంచస్థాయి ప్రమాణాల సాధన ద్వారా భారత టెలికాం రంగాన్ని అభివృద్ధి చేయడం, తద్వారా డిజిటల్ మార్కెట్‌ల విస్తృతి మరింత పెంచి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం. వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు నేడు ఆటోమేటిక్ రూట్ ద్వారా అవకాశం ఉన్న సందర్భంలో మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.
4. టెలికాం రంగ అభివృద్ధి ద్వారా ఈ-గవర్నెన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ వంటి పారదర్శక విధానాలను ప్రభుత్వ పాలనలో తీసుకురావడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడం.
5. టెలికాం రంగంలో నవకల్పనలను, స్టార్టప్‌లను, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని టెలికాం రంగ హబ్‌గా మార్చడం. రాబోయే కాలంలో మెటావర్స్, డ్రైవర్‌లెస్ కార్ల వంటి టెలికాం రంగ అనుసంధానత గల విప్లవాత్మక రంగాల్లో ఎర్లీ బర్డ్ అడ్వాంటేజ్‌ను సొంతం చేసుకోవడం.

అయితే ఇలాంటి ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలను, సైబర్ సెక్యూరిటీ సమస్యలను, ఈ-వేస్ట్ నిర్వహణ లోపాలను అధిగమించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా టెలీడెన్సిటీ పరంగా 133.76%గా ఉన్న పట్టణస్థాయికి 58.56%గా ఉన్న గ్రామీణ స్థాయికి మధ్య ఉన్న భారీ అంతరాన్ని తగ్గించడానికి డీబీఎన్ నిధులను సమర్థవంతంగా వినియోగించాల్సి ఉంది. అప్పుడే భారత్ డిజిటల్ ఇండియా కల సంపూర్ణంగా సాకారమవుతుంది.

నంబర్ రిపీట్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-1

ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో అనేక సంఖ్యల క్రమం(లాంగ్ నంబర్ సిరీస్) లేదా వర్ణమాల అక్షరాల క్రమం (ఆల్ఫాబెటికల్ లెటర్ సిరీస్) ఇస్తారు. ఈ రకమైన ప్రశ్నలకు అభ్యర్థి ముందుగా ప్రశ్నలో ఇచ్చిన నియమాన్ని జాగ్రత్తగా అవగాహన చేసుకొని కచ్చితంగా అదే నియమాన్ని అనుసరిస్తున్న సంఖ్యల సమూహాలు లేదా వర్ణమాల అక్షరాల సమూహాలు ఇచ్చిన సిరీస్‌లో ఎన్నిసార్లు వచ్చిందో సరిచూసుకొని నాలుగు ఆల్టర్నేటివ్ చాయిస్‌ల నుంచి సమాధానాన్ని గుర్తించాలి.

గమనిక: ఈ టెస్ట్‌కి సంబంధించిన ప్రశ్నలలో సాధారణంగా మూడు సంఖ్యలు లేదా మూడు వర్ణమాల అక్షరాలను ఒక సమూహంగా భావించాలి. (ముందు అనగా ఎడమవైపు, తరవాత అనగా కుడివైపు అని అర్థం)

1. కింది సంఖ్యాక్రమంలో ముందు 2 ఉండి, తరవాత 4 గల 3లు ఎన్ని ఉన్నాయి?

6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

ఎ) మూడు బి) నాలుగు సి) రెండు డి) ఏమీలేవు

సమాధానం: (ఎ)

వివరణ: 6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

పై ప్రశ్నలో '3'లు గురించి అడిగారు. కాబట్టి '3' 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 2 ఉండటం అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3'కి ఎడమవైపు 2 ఉండాలని అర్థం. తరవాత 4 అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3' కి కుడివైపు 4 ఉండాలి. అనగా 234 అనే సమూహాలు మూడు ఉన్నాయి.

2. కింది సంఖ్యాక్రమంలో ముందు 4 లేకుండా, తరవాత 6గల '5'లు ఎన్ని ఉన్నాయి?

6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) అయిదు

సమాధానం: (సి)

వివరణ: 6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

పై ప్రశ్నలో '5'లు గురించి అడిగారు. కాబట్టి '5' 'బేసిక్'గా తీసుకోవాలి. తరవాత 6 గల అనగా 5కి కుడివైపు 6 ఉండటం అని అర్థం. అనగా 56. ముందు 4 లేకుండా అనగా 5కి ఎడమవైపు 4 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 56కి ముందు(ఎడమవైపు) 4 లేని సమూహాలు నాలుగు ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 35656 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

3. కింది సంఖ్యాక్రమంలో ముందు 7 ఉండి, తరవాత 9 లేని '8'లు ఎన్ని ఉన్నాయి?

8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

ఎ) మూడు బి) అయిదు సి) నాలుగు డి) ఆరు

సమాధానం: (బి)

వివరణ: 8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

పై ప్రశ్నలో 8లు గురించి అడిగారు. కాబట్టి '8'ని 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 7 ఉండి అనగా 8కి ఎడమవైపు 7 ఉండటం అని అర్థం అనగా 78. తరవాత 9 లేకుండా అనగా 8కి కుడివైపు 9 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 78కి తరవాత (కుడివైపు) 9 లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 78786 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

4. కింద ఇచ్చిన వర్ణమాల క్రమంలో ముందు 'L' ఉండి, తరవాత 'N' లేని 'M' లు ఎన్ని ఉన్నాయి?

J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K

ఎ) 3 బి) 4 సి) 5 డి) ఏమీలేవు

సమాధానం: (ఎ) అవుతుంది.

వివరణ: J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K ఇచ్చిన ప్రశ్నలో ముందు 'L' ఉండి తరవాత 'N' లేని 'M' లు అనగా LM ఉండి 'N' ఉండకూడదు.

Mలు ఎన్ని ఉన్నాయని అడిగారు. కాబట్టి 'M'ని బేసిక్‌గా తీసుకోవాలి. ముందు 'L' ఉండి అనగా 'M'కి ముందు అనగా ఎడమవైపు 'L' ఉండాలి అనగా 'LM'. తరవాత 'N' లేని అనగా 'N' కి కుడివైపు 'N' ఉండకూడదు.



ఈ ప్రశ్నలో Mకు ముందు 'L' ఉండి తరవాత 'N' లేని అక్షర సమూహాలు మూడు ఉన్నాయి. సమాధానం (ఎ) అవుతుంది.

5. కింది వర్ణమాల క్రమంలో ముందు A లేకుండా, తరవాత C లేకుండా గల 'B'లు ఎన్ని ఉన్నాయి?

C D B A G C B B D F C B A B C E B A B G

ఎ) అయిదు బి) మూడు సి) నాలుగు డి) ఆరు

సమాధానం: (ఎ)

వివరణ: C D B A G C B B D F C B A B C E B A B G

పై ప్రశ్నలో 'B'లు గురించి అడిగారు. కాబట్టి Bను 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు A లేకుండా అనగా 'B'కి ఎడమవైపు A ఉండకూడదు. తరవాత 'C' లేని అనగా 'B' కి కుడివైపు 'C' ఉండకూడదు. ప్రశ్నలో ఇచ్చిన ప్రతి 'B'ని పరిశీలిస్తే Bకి ఎడమవైపు Aలేని, Bకి కుడివైపు 'C' లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనిక: పై సిరీస్‌లో CBBD అనే 4 అక్షరాలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.




డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కళాశాలల్లో ఇదేం సంస్కృతి?!

ర్యాగింగ్‌ను మించి వికృత చేష్టలు

- విద్యార్థినులపై అసభ్య కామెంట్లు
- గంజాయి, డ్రగ్స్‌పైనే ఎక్కువ చర్చ
- కాలేజీల్లో చేయిదాటుతున్న పరిస్థితి
- ప్రైవేటు వర్సిటీల్లోనూ పెడపోకడలు
- అడ్డుకట్ట వేయకపోతే ప్రమాదమే
- గ్రీవెన్స్ కమిటీలపై పర్యవేక్షణ నిల్
- ఫిర్యాదులు పట్టని యాజమాన్యాలు
- ఏఐసీటీఈ, యూజీసీ నిబంధనలు గాలికి

అది విజయవాడ నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ. కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొంది అందులో చేరిన ఒక విద్యార్థినికి రెండు రోజులకే చేదు అనుభవం ఎదురైంది. కొందరు విద్యార్థులు ఆ అమ్మాయిని భౌతికంగా తాకే ప్రయత్నం చేశారు. ఆమెను తరగతి వాట్సాప్ గ్రూపులో చేర్చి అసభ్యకరమైన కామెంట్లు చేశారు. ఇవన్నీ చూసి భయాందోళన చెందిన ఆ విద్యార్థిని దీనిపై అధ్యాపకులకు ఫిర్యాదు చేసింది. అయితే "కాలేజీల్లో ఇవన్నీ రొటీన్... పట్టించుకోకూడదు..." అని యాజమాన్యం నుంచి సమాధానం రావడంతో ఆమె తల్లిదండ్రులు ఆ కాలేజీ నుంచి టీసీ తీసుకొని బయటపడ్డారు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థినుల దుస్తులపై వెకిలి జోకులు... గంజాయి కోసం ఆరాలు... మరింత కిక్ ఇచ్చే డ్రగ్స్ ఏమిటంటూ చర్చలు... యువత భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన కాలేజీల్లో సాగుతున్న ఆందోళనకరమైన ట్రెండ్ ఇదీ... కళాశాలల్లో చక్కటి నైపుణ్యాలు సొంతం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన విద్యార్థులు పెడదారి పడుతున్నారు. పుస్తకాలు, పరీక్షలు, మార్కుల గురించి కాకుండా గంజాయి, డ్రగ్స్‌పై చర్చిస్తున్నారు. కొందరు విద్యార్థులు వాటి మాయలో చిక్కి మత్తులో చిత్తవుతున్నారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇదే వ్యవహారం నడుస్తోంది. పెద్దగా పేరులేని కాలేజీల నుంచి ప్రముఖ విద్యాసంస్థల వరకూ, కొన్ని ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ ఈ పోకడ నానాటికీ పెరుగుతోంది. ఒకప్పటి ర్యాగింగ్ సంస్కృతి ఇప్పుడు వికృత ధోరణిగా రూపుదాల్చింది. కాలేజీల్లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ, మహిళా గ్రీవెన్స్ కమిటీలు నామమాత్రంగా మారాయి. కేవలం ఉన్నాయని చూపించుకోవడానికి మినహా అవి ఎందుకూ ఉపయోగపడటం లేదు. అసలు ఫిర్యాదులు కాలేజీని దాటి యూనివర్సిటీ స్థాయికి చేరకుండా కొన్ని యాజమాన్యాలు తొక్కిపెడుతున్నాయి. కళాశాల స్థాయిలోనే పరిష్కారమైనట్లు చూపిస్తున్నా, ఎక్కడా ఫిర్యాదులను పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. తాజాగా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో బయటపడిన రహస్య కెమెరాల వ్యవహారంతో కాలేజీల్లో ఆకృత్యాల వ్యవహారం చర్చనీయాంశమైంది.

◆ ఇవీ నిబంధనలు

కాలేజీల్లో కమిటీల ఏర్పాటుకు సంబంధించి ఏఐసీటీఈ, యూజీసీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయి. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ కమిటీ, మహిళలపై వేధింపుల నిరోధక కమిటీ కచ్చితంగా ఉండాలి. భౌతికంగా విద్యార్థులను వేధించినా, ఇబ్బందికరమైన కామెంట్లు చేసినా, కాలేజీల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించినా, ఎవరిపై అయినా దుష్ప్రచారం చేసినా ఈ కమిటీలకు ఫిర్యాదు చేయొచ్చు. ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, విద్యార్థులతో కూడిన ఈ కమిటీల్లో కనీసం ఐదుగురు సభ్యులు ఉంటారు. అందులో కనీసం ముగ్గురు మహిళలు ఉండాలి. తొలుత కాలేజీ స్థాయిలో ఫిర్యాదులపై విచారణ చేస్తారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే, సంబంధిత యూనివర్సిటీ కమిటీకి పంపుతారు. అక్కడ రిటైర్డ్ జడ్జి స్థాయిలో విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తారు.

◆ కాలేజీల్లో జరుగుతున్నది ఇదీ..

ఏఐసీటీఈ నిబంధనలను కాలేజీ యాజమాన్యాలు నిర్వీర్యం చేస్తున్నాయి. విద్యార్థినులపై వేధింపులు, విద్యార్థులపై ర్యాగింగ్ చేసినా బాధితులు ఫిర్యాదు చేయడానికే భయపడుతున్నారు. కాలేజీల బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తింటుందనే భయంతో యాజమాన్యాలు ఈ కమిటీలను నామమాత్రం చేశాయి. తమ కాలేజీలో ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు లేవని చూపించడానికి ప్రయత్నిస్తున్నాయి. అడ్మిషన్లు పెంచుకోవాలని, బ్రాండ్ ఇమేజ్‌ను మెరుగుపర్చుకోవాలని చూస్తున్నాయి. దీంతో ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదనే భావనతో ఎవరూ ఆ దిశగా ప్రయత్నం కూడా చేయడం లేదు.

కూటమి ప్రభుత్వంపై బాధ్యత

విద్యా రంగంలో ప్రమాణాలు పెంచడంతో పాటు కాలేజీల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. గత ప్రభుత్వంలో అటు చదువులు, ఇటు ఫిర్యాదులు రెండింటినీ పట్టించుకోకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగింది. అందువల్లే పేరున్న కాలేజీల్లో కూడా పిల్లలను చేర్పించాలంటే తల్లిండ్రులు భయపడే పరిస్థితి వచ్చింది. రోజూ కాలేజీకి వెళ్లొచ్చే వారికంటే హాస్టళ్లలో ఉండే వారు తొందరగా తప్పుదారి పడుతున్నారు. జూనియర్ కాలేజీలతో పోలిస్తే ఎక్కువ స్వేచ్ఛ ఉండటం, తల్లిదండ్రులు దూరంగా ఉండటం, కాలేజీ యాజమాన్యాల నిర్లక్ష్యంతో ఉన్నత విద్యాసంస్థల్లో వికృత పోకడ పెరుగుతోంది. దీనిపై ఇప్పుడే కఠినంగా వ్యవహరించకపోతే విద్యార్థుల చదువులతో పాటు, రాష్ట్ర ఇమేజ్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

వైసీపీ సర్కారు పుణ్యమే

ఉన్నత విద్యాసంస్థల్లో వికృత చేష్టలు ఇప్పుడే కొత్త కాకపోయినా కొంతకాలంగా ఈ ధోరణి పెరగడానికి గంజాయి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో గంజాయి గ్రామస్థాయికీ చేరిపోయింది. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో దీని వినియోగం బాగా పెరిగింది. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని మరీ గంజాయి ఎక్కడ దొరుకుతుందని విద్యార్థులు ఆరా తీస్తున్నారు. గంజాయి వినియోగించి తోటి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు శృతిమించిన కామెంట్లు చేస్తున్నారు. కాలేజీలకు గంజాయి, డ్రగ్స్ చేరకుండా నియంత్రిస్తే, ఇతర వేధింపులు కూడా ఆగే అవకాశం ఉంది.

ముఫ్తీ ఎన్నికల ప్రచారం రద్దు

- హిజ్బుల్లా నేత నస్రల్లా హత్య నేపథ్యంలో నిర్ణయం
- పాలస్తీనా, లెబనాన్ ప్రజలకు సంఘీభావంగా ప్రకటన

శ్రీనగర్, సెప్టెంబరు 29: హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లాను ఇజ్రాయిల్ అంతమొందించిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆదివారం తన ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్నారు. పాలస్తీనా, లెబనాన్ దేశాల ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్న దృష్ట్యా వారికి సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె 'ఎక్స్'లో ప్రకటించారు. మరోవైపు నస్రల్లా హత్యకు నిరసనగా శ్రీనగర్‌లోని అనేక ప్రాంతాల్లో ప్రజలు శనివారం నల్లజెండాలతో ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించారు. ఇజ్రాయిల్, అమెరికా వ్యతిరేక నినాదాలను హోరెత్తించారు. ఈ ర్యాలీలలో చిన్నపిల్లలు కూడా పాల్గొన్నారని అధికారులు తెలిపారు. కాగా, మెహబూబా ముఫ్తీ ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకోవడం 'రాజకీయ స్టంట్' అంటూ బీజేపీ విమర్శించింది. 'నస్రల్లాను చంపితే ముఫ్తీకి బాధ కలిగింది. మరి బంగ్లాదేశ్‌లో హిందువులను చంపినప్పుడు ఆమె ఎందుకు మౌనంగా ఉన్నారు. ఇదంతా నకిలీ సానుభూతి. ఆమెవి మొసలి కన్నీళ్లు. ప్రజలు అన్నీ అర్థం చేసుకుంటారు' అని బీజేపీ నాయకుడు కవిందర్ గుప్తా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని మరో బీజేపీ నేత అల్తాఫ్ ఠాకూర్ కూడా ముఫ్తీది ఎన్నికల స్టంట్ అంటూ తప్పుబట్టారు. కాగా, నస్రల్లా హత్య నేపథ్యంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, మతతత్వ పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని కశ్మీర్ సైబర్ పోలీసులు హెచ్చరించారు. 'మత సామరస్యానికి భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పెట్టిన మతతత్వ, ఉద్రిక్తతలను ప్రేరేపించే పోస్టులను మేం గమనించాం. అలాంటి విద్వేష పోస్టులు పెట్టొద్దని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం' అని ఒక అడ్వైజరీని సైబర్ పోలీసులు 'ఎక్స్'లో పోస్టు చేశారు. శాంతికి విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర మంత్రి నిర్మల రాజీనామా చేయాలి

- కేసు నమోదు నేపథ్యంలో కాంగ్రెస్ డిమాండ్
- ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసింది
- బాండ్ల స్కీమ్ కుట్రతో పలు మార్గాల్లో డబ్బు దోపిడీ
- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్‌తో దర్యాప్తు జరిపించాలని డిమాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఎన్నికల బాండ్ల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో ఆమె తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ ద్వారా అధికార బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించింది. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, అభిషేక్ మనుసింఘ్వీ ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌పై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరిపించాలన్న తమ పార్టీ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. ఈ బాండ్ల కుట్ర ద్వారా 'ముందస్తు లంచం, పని పూర్తయిన తర్వాత లంచం, దాడుల తర్వాత లంచాలు' వంటి తదితర రూపాల్లో డబ్బు దోపిడీ జరిగిందని జైరాం రమేశ్ ఆరోపించారు. రాజకీయంగా, న్యాయపరంగా, నైతికంగా ఆర్థిక మంత్రి సీతారామన్ దోషిగా నిలిచారని, ఆమె వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, దీనితో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. సింఘ్వీ మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ కుట్రలు చేసిందన్నారు. 'ఎలక్టోరల్ బాండ్ల ద్వారా దోపిడీని కేంద్ర ఆర్థిక మంత్రి సొంతంగా అయితే చేయలేదు. దీని వెనుక ఉన్న నంబర్ 1, 2లు ఎవరో మనకు తెలుసు. వారి ఆదేశాల మేరకు ఆమె ఇది చేశారు' అని ఆరోపించారు. ప్రజాస్వామ్య మనుగడకు స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు అత్యంత ముఖ్యమని, అయితే మన ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి జరుగుతోందని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌ను ఆయన 'దోపిడీదారుల బీజేపీ స్కీమ్'గా వర్ణించారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌పై దాఖలైన పిటిషన్ మేరకు బెంగళూరులోని స్థానిక ప్రత్యేక కోర్టు ఆదేశాలతో పోలీసులు శనివారం సీతారామన్ సహా పలువురు ఈడీ అధికారులు, బీజేపీ జాతీయ, రాష్ట్రస్థాయి నేతలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

'ఆయుష్మాన్ భారత్'లో అర్హులైన వృద్ధులను చేర్చండి

Ayushman Bharat Yojana

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా' పథకంలో అర్హులైన వృద్ధులను చేర్పించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. 70 ఏళ్లు, ఆ పైన వయసున్న వారిని ఈ పథకంలో చేర్చాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి ఎల్.ఎస్.చాంగ్‌సాంగ్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు. ఈ పథకంలో వృద్ధుల నమోదుకు ఆయుష్మాన్ మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరాలనుకునే వృద్ధులు యాప్ లేదా పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఏడాదంతా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ పథకం కింద సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆరోగ్య బీమా (ఏడాదికి రూ.5 లక్షలు) వర్తిస్తుందని తెలిపారు. ఆధార్‌లో ఉన్న వయసు ఆధారంగా వృద్ధులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జాబిల్లిపై అతి పురాతన బిలం..!

- ఇది 8.35 బిలియన్ ఏళ్ల క్రితం నాటిది.. ల్యాండర్ దిగింది ఇక్కడే: శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఇస్రో ప్రతిష్ఠాత్మక మూన్ మిషన్ చంద్రయాన్-3కు సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. చంద్రయాన్-3 మిషన్, ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు.. విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై ఉన్న అతిపురాతన బిలంపై దిగి ఉండొచ్చని తెలిపారు. సుమారు 160 కిలోమీటర్ల వ్యాసం కలిగిన ఈ బిలం 8.35 బిలియన్ సంవత్సరాల క్రితంనాటి నెక్టేరియన్ కాలంలో ఏర్పడి ఉంటుందని, ఇది చంద్రుని చరిత్రలో అత్యంత పురాతనమైన కాలాల్లో ఒకటని అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ, ఇస్రో శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఆ వివరాలను ఇకారస్ అనే సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. 'చంద్రయాన్-3 దిగిన ప్రాంతం మరే ఇతర మిషన్లూ వెళ్లని ఒక ప్రత్యేకమైన భౌగోళిక వాతావరణంలో ఉంది. ల్యాండర్‌లోని ప్రజ్ఞాన్ రోవర్ పంపిన ఈ ప్రాంతానికి సంబంధించిన చిత్రాలు.. కాలక్రమేణా చంద్రుడు ఎలా పరిణామం చెందాడో వెల్లడిస్తాయి' అని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీలో ప్లానెటరీ సైన్సెస్ డివిజన్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్ విజయన్ తెలిపారు. సాధారణంగా ఒక గ్రహాన్ని, లేదా చంద్రుడి వంటి భారీ ఉపరితలాన్ని గ్రహశకలం ఢీకొట్టినప్పుడు బిలం ఏర్పడుతుంది. అలా ఏర్పడిందే ఈ పురాతన బిలమని, విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతానికి దగ్గరలోనే ఇది ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఎన్నాళ్లీ వెట్టి చాకిరీ..

● అరకొర వేతనాలతో ఉపాధిహామీ కాంట్రాక్ట్ ఉద్యోగుల అవస్థలు
● దక్కని పదోన్నతులు.. కానరాని క్రమబద్ధీకరణ ● జిల్లాలో 500 మందికి పైగా ఇదే పరిస్థితి


ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు (ఫైల్)

రాజాం రూరల్: గ్రామీణాభివృద్ధి శాఖలో సుమారు రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సుమారు రెండు దశాబ్దాలుగా మండల స్థాయిలో వెట్టిచాకిరీ చేస్తున్నా ప్రభుత్వాలు వీరి వేతనాల పెంపు దిశగా ఆలోచన చేయలేదు. పదోన్నతుల ఊసెత్తలేదు. సర్వీస్ క్రమబద్ధీకరణ జోలికి పోలేదు. ఫలితంగా జిల్లాలో 500 మందికి పైగా ఉద్యోగులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తూ త్రిశంకుస్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. మండల, గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న వీరు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా నియమితులై అలాగే రిటైర్ అవుతున్నారు.

● కేంద్ర, రాష్ట్రాల పరిధిలో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పనిచేస్తున్న వీరిపై రెండు ప్రభుత్వాలు శీతకన్ను వేశాయి. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ వీరిపై చూపకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధిహామీ పథకం కింద గ్రామస్థాయిలో వివిధ పనులను అమలుచేయడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయినాసరే తమపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని కాంట్రాక్ట్ ఉద్యోగులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

● కలెక్టర్ నియమించినా..

జిల్లాలో ఉపాధిహామీ పథకం నిర్వహణకు వీలుగా 2006లో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధిహామీ ఉద్యోగుల నియామకం జరిగింది. అప్పట్లో ఏపీవోలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంట్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమితులైన వారంతా 19 ఏళ్ల తరువాత కూడా అవే హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

● ఆర్థికంగా ఇబ్బందులు..

పెరిగిన ధరల నేపథ్యంలో చాలీచాలని జీతాలతో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు జీవితాలను గడుపుతున్నారు. కుటుంబ పోషణతో పాటు పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించలేక సతమతమవుతున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు కావడంతో వాణిజ్య బ్యాంకులు కనీసం రుణాలు కూడా ఇవ్వడంలేదని వాపోతున్నారు. ప్రయివేటు బ్యాంకులు, సూక్ష్మ ఆర్థిక సంస్థల నుంచి ఎక్కువ వడ్డీలకు అప్పులు తీసుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఫలితంగా కుటుంబాలపై పెను ప్రభావం చూపుతున్నాయని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


స్పెషల్ చీఫ్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

● ఆ ఐదేళ్లూ...

వైసీపీ ప్రభుత్వ హయాంలో గత అయిదేళ్లూ కాంట్రాక్ట్ ఉద్యోగుల వైపు కన్నెత్తి చూడలేదు. ప్రతిపక్షనేతగా పాదయాత్ర చేసిన సందర్భంలో తాను అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని జగన్‌రెడ్డి ఇచ్చిన హామీ అయిదేళ్లలలో అమలు చేయలేదు. ఇదిలా ఉంటే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో (2014-19) ప్రభుత్వోద్యోగులకు ప్రకటించిన పీఆర్సీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వర్తింపజేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఆదిశగా కూడా పీఆర్సీ వర్తింపచేయకపోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెరగలేదు. ఫలితంగా వారి జీవనప్రమాణాలు దిగజారుతూ వస్తున్నాయి.



● **క్రమబద్ధీకరించాలి..**

మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. గ్రేడ్ ఫిక్స్ చేయాలి. సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలి. పీఆర్సీ ఇంప్లిమెంట్ చేయాలి. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన నష్టాన్ని కూటమి ప్రభుత్వం భర్తీ చేయాలి.

-కిలారి రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్



● **ఎదుగూ, బొదుగూ లేదు..**

ఉద్యోగంలో ఎలా చేరామో నేటికీ అలాగే ఉన్నాం. ఉద్యోగపరంగా ఎదుగూ, బొదుగూ లేదు. ఒక్కరూపాయి కూడా పెంచలేదు. శ్రమదోపిడీ తప్ప సంతృప్తి లేదు. సెర్ప్ ఉద్యోగులతో సమాన వేతనా లివ్వాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలి.

-బలగ అప్పారావు, కంప్యూటర్ ఆపరేటర్

పది రోజుల వ్యవధిలో భార్యాభర్త మృతి


పార్వతీ, సుబ్బారావు (ఫైల్)

కొమరాడ: మండలంలోని బట్టివలస గ్రామంలో పది రోజుల వ్యవధిలో భార్యా భర్తలు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మెల్లిక సుబ్బా రావు(40) పది రోజుల కిందట తన పొలంలో పురుగు మందు పిచికారీ చేసి ఇంటికి వచ్చిన తర్వాత స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీ పురం వైద్యశాలకు తీసుకువెళ్లగా, అప్పటికే మృతిచెందాడు. ఈ ఘటన జరిగి పది రోజులు కాగా మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న సుబ్బారావు భార్య మెల్లిక పార్వతి(35) అనారోగ్యంతో శుక్రవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. వీరికి ఇద్దరు పిల్లలు కుమార్తె సంధ్యారాణి ఇంటర్ చదవగా, కుమారుడు పవన్‌కుమార్ డిగ్రీ చదువుతున్నాడు. తల్లిదండ్రుల మృతితో వీరు అనాథలయ్యారు. వీరికి ప్రభుత్వం అండగా ఉండాలని వీరికి ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి కోరారు. పది రోజుల వ్యవధి లోనే భార్యా భర్తలు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గిరిజన మహిళ ఆత్మహత్య

పాచిపెంట: మనస్తాపంతో ఓ గిరిజన మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై పాచిపెంట ఎస్ఐ వెంకటసురేష్ ఆదివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. పద్మాపురం గ్రామానికి చెందిన కుంబీ రాముకు ఒడిశా జోడి మద్దిలి గ్రామానికి చెందిన జ్యోతితో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇదేక్రమంలో తన భర్త రాము కుటుంబ బాధ్యతలను పట్టించుకోకుండా తిరిగేవాడు. దీంతో భార్య జ్యోతి భర్త రామును పలుమార్లు నిలదీసింది. ఈక్రమంలో శనివారం రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాత్రి ఇంట్లో వేర్వేరు చోట్ల భార్యా భర్తలు నిద్రించారు. రాము అర్థరాత్రి మెలుకువ వచ్చి భార్యను చూడగా వంట గదిలో ఉరి వేసుకుంది. ఈ విషయం రాము ఇరుగు పొరుగు వారికి తెలియజేశాడు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బొబ్బిలి: పట్టణానికి సమీపంలోని ఎం.బూర్జివలస సమీపంలో ఆదివారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. చెల్లారపువలస గ్రామానికి చెందిన గొట్టాపు రామకృష్ణ పాతపెంట గ్రామం వేగావతి నది నుంచి ఇసుకను ట్రాక్టర్‌ద్వారా తరలిస్తుండగా పట్టుబడడంతో స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితుని అరెస్టు చేసి సొంతపూచీకత్తుపై విడుదల చేశామన్నారు. సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని ఏఎస్ఐ తెలిపారు.

ఇంట్లో చోరీ

రేగిడి: మండలంలో దేవుదళ గ్రామంలో పాలవలస కృష్ణ ఇంట్లో చోరీఘటన చోటుచేసుకుంది. కృష్ణ కుటుంబం కాశీ తీర్థయాత్రలకు వెళ్లగా, వీరులేని సమయం చూసి గుర్తుతెలియని ఆగంతకులు ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. పనిమనిషి ఇళ్లు తుడిచేందుకు ఆదివారం ఉదయం వెళ్లగా ఈఘటన వెలుగులోకి వచ్చింది. చోరీ ఎప్పుడు జరిగింది అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో కొన్ని వస్తువుల అపహరించుకుపోయి, కప్‌బోర్డులు పగలుగొట్టి వస్తువులు చిందర వందర చేశారు. చోరీ సొత్తు ఎంత అన్నది ఇంకా స్పష్టత లేదు. బాధిత కుటుంబం బందువు సుంకర జనార్దనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేగిడి ఎస్ఐ నీలావతి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీమ్ రంగంలో దిగి చోరీ ఇంటిని పరిశీలించింది.

నేడు బొబ్బిలికి సినీనటుడు సాయికుమార్

బొబ్బిలి: పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక శ్రీసూర్య రెసిడెన్సీలో మత్తు పదార్థాల వినియోగం-వాటి దుష్పరిణామాలు అనే అంశంపై సంకల్పం పేరుతో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమానికి సినీనటుడు సాయికుమార్ హాజరవుతున్నట్లు సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. యువతకు సందేశం ఇచ్చేందుకు విశాఖ రేంజి డీఐజీ, జిల్లా ఎస్పీ, స్థానిక ఎమ్మెల్యే, డీఎస్పీ హాజరవుతారని ఆయన తెలిపారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తామని, ఈ ర్యాలీలో విద్యార్థులు, యువకులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు అధ్యక్షతన సోమవారం నిర్వ హించనున్నట్లు కమిషనరు లాలం రామలక్ష్మి తెలిపారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

టీసీలకు ఒత్తిడి చేయడం తగదు

బొబ్బిలి: స్థానిక సీబీఎం బాలికల హైస్కూలు నుంచి టీసీలు తీసుకుని వెళ్లాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడం, బెదిరింపులకు పాల్పడడం తగదని ప్రజాసంఘాల నాయకులు మునకాల శ్రీనివాస్, వేమిరెడ్డి లక్ష్మునాయుడు, సీపీఐ నాయకులు కోట అప్పన్న అన్నారు. ఆదివారం పాఠశాల దగ్గర వారు మాట్లాడుతూ స్కూలును పూర్తిగా ఎత్తివేసేందుకు జరిగిన కుట్రపై దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ లావాదేవీలకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీబీఎం హైస్కూలు బాగోతంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుస్తుల పంపిణీ

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో రాణి మల్లమ్మ దేవీ పార్కు గట్టుపై నివసిస్తున్న నక్కల జాతికి చెందిన పేద మహిళలకు వనమిత్ర కృష్ణదాస్ దుస్తులు, ఆహార పొట్లాలు అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదవాళ్లకు సాయం చేయడం దైవ కార్యక్రమంతో సమానమన్నారు.

రక్తదాన శిబిరం

విజయనగరం రింగురోడ్డు: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, కిడ్స్ స్కూల్ సంయుక్తంగా అయ్యన్నపేట జంక్షన్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు రవికుమార్ మాట్లాడుతూ, శరీరంలో ముఖ్యమైన అవయమైన గుండెను కాపాడుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శిబిరంలో సుమారు 10 మంది రక్తదానం చేశారు. త్యాడ వేణుగోపాలం, శ్రావణి, కీర్తన ప్రసాద్ పట్నాయక్ పాల్గొన్నారు.

నేడు బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు

శృంగవరపుకోట: జిల్లాలోని నెమలాం ఉన్నతపాఠశాలలో నేడు బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు జరుగుతున్నట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైనవారు అక్టోబరు 5న విశాఖ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

లడ్డూ వేలం

శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట పెద్దవీధిలో వాయుపుత్ర యూత్ ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద ఏర్పాటుచేసిన లడ్డూ వేలం పాటను ఆదివారం నిర్వహించారు. ఈ వీధికి చెందిన వసంతకుమార్ బ్రదర్స్ దీనిని రూ.66వేలకు దక్కించుకున్నారు.

ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ పండగ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు వాల్తేరు డివిజన్ డీఆర్ఎంకు లేఖ రాశారు. విశాఖపట్టణం, విజయనగరం టూ పలాస, విశాఖపట్నం, విజయనగరం, రాయగడ వరకూ ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలన్నారు. పండుగ నేపథ్యంలో వేలాది మంది భక్తులు పైడిమాంబను దర్శించుకునేందుకు వస్తుంటారని, ఈ నేపథ్యంలో రైళ్ల ఏర్పాటు అవసరమని అన్నారు.

కోండ్రుకు ఆహ్వానం

రాజాం: రాజాం పట్టణంలో వచ్చే నెల 13 నుంచి 15వ వరకు జరగబోవు గ్రామదేవత పండగకు హాజరుకావాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు కమిటీ ప్రతినిధులు ఆహ్వానం ఆదివారం అందజేశారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ పండగను పట్టణ ప్రజలు అన్ని వార్డులకు సంబంధించి ఘనంగా నిర్వహిస్తారని ఈ కార్యక్రమానికి విధిగా హాజరుకావాలని కోండ్రు జగదీస్‌ను కలిసి ఆహ్వానం అందజేశారు.

మద్యం సీసాలు స్వాధీనం

మెంటాడ: మండలంలోని చింతలవలస గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యం సీసాలను ఆంధ్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సీతారాం తెలిపారు.

ప్రజా సేవకోసమే జనసేనలో చేరాం

● అవనాపు విక్రమ్ దంపతులు


ర్యాలీలో అభిమానులకు అభివాదం చేస్తున్న విక్రమ్, భావన

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో చేరి తొలి సారి విజయనగరానికి విచ్చేసిన అవనాపు విక్రమ్, డాక్టర్ భావన దంపతులకు నగర జనసేన పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు ఘనస్వాగతం పలికారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, పాలవలస యశస్వీని, లోకం ప్రసాద్, గురాన అయ్యలు, కాళ్ల గౌరీ శంకర్, ఆదాడ మోహన్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అవనాపు దంపతులను అభినందించారు. అనంతరం వై.జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ మీదుగా రైల్వేస్టేషన్, కన్యాకాపరమేశ్వరి గుడి, ఎంజీ రోడ్డు మీదుగా పైడితల్లమ్మ ఆలయం వరకు బైక్‌లు, కార్లు, వేలాది మంది అభిమానులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్, భావన దంపతులు మీడియాతో మాట్లాడారు. పదవుల కోసం పార్టీలో చేరలేదని, మొదటి నుంచి తమ కుటుంబం రాజకీయంగా ప్రజలకు సేవలందించే కుటుంబమన్నారు. పవన్‌కల్యాణ్ భావాలు, నచ్చి పార్టీలో చేరామని, అక్రమాలు, అన్యాయాలపై పోరాటం చెయ్యడంలో చెగువీరకు ఉన్నంత తెగువ పవన్‌లో ఉందన్నారు. కూటమి నేతలందరినీ కలుపుకుని పోయి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కూటమి నేతలు అశోక్‌గజపతిరాజు తమకు ఆదర్శమన్నారు. జిల్లా అభివృద్ధికి కూటమి నేతలైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి, నాగమాదవి తదితర నాయకులతో కలిసి జిల్లా, నగరాభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. నాగమాధవి మాట్లాడుతూ మరింత మంది మాజీలు, వారి కార్యకర్తలు జనసేన పార్టీలో చేరేందుకు వేచి చూస్తున్నారని, జనసేన అధినేత సూచించినట్లు ప్రజలకు సేవలందించే మంచివారిని మాత్రమే పార్టీలోకి చేర్చుకుంటామన్నారు. ఈ కోవలోనే విక్రమ్, డాక్టర్ భావనను పవన్‌కల్యాణ్ పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు.

నేడు మహిళా గర్జన


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాజీ చానల్ ఎండీ శ్రీనివాసరావు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 29: సహనానికి మారుపేరుగా నిలిచే మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాడుదామని వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 30న సోమవారం ఉదయం 9 గంటలకు కోట జంక్షన్ నుంచి 'మహిళా గర్జన' పేరుతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాల్గొంటారన్నారు. ప్రతి మహిళా శివంగిలా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ ర్యాలీ కోట వద్ద ప్రారంభమై గంట స్తంభం, గురజాడ అప్పారావు స్వగృహం మీదుగా తిరిగి కోట వద్దకు చేరుకుని అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా గర్జనకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా గర్జన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు

రామభద్రపురం: మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు హెచ్చరించారు. మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులపై లైంగిక దాడులు జరిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ వెలమల ప్రసాదరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలి

రేగిడి: ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించుకోవాలని, దీనివల్ల అనేక అనర్థాలు ఉన్నాయని స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ పద్మ పేర్కొన్నారు. అంబఖండి గ్రామంలో ఆదివారం స్వచ్ఛతాహీసేవలో ప్లాస్టిక్ వినియోగం, దీనివల్ల అనర్థాలపై పంచాయతీ కార్యదర్శి హేమసుందరరావు ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమం నిర్వహించారు. నాయకులు గోవిందరావు, గ్రీన్‌అంబాసిడర్స్ పాల్గొన్నారు.

విద్యార్థుల మెదడుకు పదును పెట్టాలి

బొబ్బిలి: యూసిమాస్ లెక్కల విధానంతో విద్యార్థులు ఆ సబ్జెక్టులో చురకత్తుల్లా తయారవుతారని సౌత్ఇండియా హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, విద్యావేత్త డాక్టర్ చింతా శారద అన్నారు. స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం సంస్థ నిర్వాహకురాలు స్వప్నామోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శారద ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్శల్ కాన్సెప్ట్‌మెంటల్ అర్థమెటిక్ సిస్టమ్(యూసీమాస్) విధానంలో విద్యార్థులకు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణాయకశక్తి, రీజనింగ్, విజువల్ స్కిల్స్ అమోఘంగా ఉంటాయన్నారు. అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. 8 నిమిషాల వ్యవధిలో 200 విశ్లేషణలను ఆరు చేతివేళ్లను ఉపయోగించి ప్రదర్శించారు. వారందరికీ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు, న్యాయవాది మల్లూరు మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎఫ్ఎల్ డిపో మేనేజరుగా గౌరీశ్వరరావు

విజయనగరం క్రైం: ఏపీఎస్‌బీసీఎల్ ఐఎంఎఫ్ఎల్ డిపో నెల్లిమర్ల మేనేజరుగా ఆర్ గౌరీశ్వరరావుని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఇక్కడ డిపో మేనేజరుగా విధులు నిర్వహించిన ఎన్‌వీ రమణ అనకాపల్లి డిపో మేనేజరుగా బదిలీపై వెళ్లారు.

జగన్ అసలు రంగు బయటపడింది: కోళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అసలు రంగు తిరుమల పర్యటన రద్దుతో బయటపడిందని ఎస్. కోట నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ సభ్యురాలు కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం ఆమె నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. తిరుపతి లడ్డూ వివాదంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న సందర్భంలో ప్రజలను ముఖ్యంగా వెంకన్న భక్తులను రెచ్చగొట్టే విధంగా తిరుమల పర్యటన పెట్టుకోవడం జగన్ నైజానికి నిదర్శనమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా తిరుమల పర్యటనకు పోలీసులు జగన్‌ని అనుతించకపోతే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం లాంటివారే డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నారని గుర్తుచేశారు. గత అయిదేళ్లు సెక్షన్ 30 కింద ఎంత మందిని ఇబ్బందిపెట్టారో గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలతో రాజకీయం చేయాలనుకుంటే గత నేతల గతే నీకుపడుతుందని హెచ్చరించారు. రౌడీయిజం చేస్తామంటే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదన్నారు.

'పేదవారికి కార్మిక బీమా ఓ వరం'

లక్కవరపుకోట: కార్మిక బీమా పేదలందరికీ వరంలాంటిదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గాడి అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులేనని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి కాకుండా ఉంటే ఈ బీమా పొందవచ్చునని, ఏడాదికి కేవలం రూ.22లు మాత్రమే ఖర్చవుతుందని, అయిదేళ్ల కాలానికి రూ.110లు చెల్లించి బీమా పొందవచ్చునన్నారు. కేవలం కార్మికులే ఇందులో చేరాలనే అపోహ అందరిలోనూ ఉందని, అది నిజం కాదన్నారు. కూలిపని చేసుకుంటున్న 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. బీమా పొందిన వ్యక్తి సహజ మరణం పొందితే లక్షా 30 వేల రూపాయల బీమా వస్తుందన్నారు. ప్రమాదంలో మరణిస్తే ఆరు లక్షల రూపాయలు ఇస్తారన్నారు. బీమా పొందిన ఏడాది తరువాత ప్రమాదం జరిగి 50 శాతం అంగవైకల్యం ఏర్పడితే రూ.2.50 లక్షలు, పూర్తి వైకల్యం ఏర్పడితే రూ.5 లక్షలు బీమా పొందవచ్చునన్నారు. ఇద్దరు ఆడపిల్లలుంటే పెళ్లి నిమిత్తం రూ.30వేలు చొప్పున, ప్రసవానికి రూ.30వేలు చొప్పున అందుతాయని తెలిపారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

జామి: మండలంలోని కుమరాంలో కస్తూర్బా పాఠశాలలో పదోతరగతి చదువుతున్న శ్రీలక్ష్మి అనే బాలిక రోడ్డు ప్రమాదంలో గాయపడింది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యానికి చాలా ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న కుమారాం కస్తుర్బాలో పనిచేస్తున్న కంప్యూటర్ టీచర్ గౌరీమాధవి, ఆమె భర్త వెంకట శ్రీను విషయం తమ మిత్రులకు, సహచరులకు తెలియజేశారు. గౌరీ మాధవి చెల్లెలు రూహీ సైతం స్పందించారు. విద్యార్థినిని ఆదుకునేందుకు తమ వద్ద ఉన్న నగదుతో పాటు తెలిసిన వారి ద్వారా నగదు సేకరించి రూ.ఒక లక్ష రూపాయలను బాలిక కుటుంబానికి ఆదివారం అందించారు.

'పీలా'ను కలిసిన గవర సంఘం నాయకులు

వేపాడ: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించి పెందుర్తి విచ్చేసిన పీలా గోవింద సత్యనారాయణను వేపాడ, లక్కవరపుకోట మండలాలకు చెందిన పలువురు నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని లక్కవరపుకోట, వేపాడ మండలాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లక్కవరపుకోట మండల మాజీ ఎంపీపీ కొల్లి వెంకటరమణమూర్తి, మాజీ ఎంపీటీసీ మళ్ల రామకృష్ణ, వేపాడ మండల నేతలు బుద్ధ అప్పలనాయుడు,యేడువాక గణేష్ ,తదితరులు పూలమాలలు వేసి ఆయనను ఘనంగా సన్మానించారు.

ఉన్నత విద్యాబోధనలో 'సెంచూరియన్' అగ్రగామి



మాట్లాడుతున్న వర్సిటీ రిజిస్ట్రార్ అనితాపాత్రో

పర్లాకిమిడి: ఉన్నత విద్యాబోధనలో సెంచూరియన్ విద్యాలయం అగ్రగామిగా నిలుస్తోందని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో తెలిపారు. ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్య అందించడంతో పాటు వారిలో దాగివున్న ప్రతిభను గుర్తించి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సెంచూరియన్ వేదిక అవుతుందన్నారు. పిల్లలు ఎలా మెలుగుతున్నారో తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. సెంచూరియన్‌లో చదువుతున్న విద్యార్థులంతా క్రమశిక్షణతో ఉండడం వల్ల విద్యాలయానికి మంచి పేరు తీసుకురాగలిగామన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ జనరల్ మేనేజర్ ఫాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పశువుల పండగ


రంగారాయపురంలో నిర్వహిస్తున్న పశువుల పండగ

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం పశువుల పండగను గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఏటా వరి పంట చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు పశువుల పండగ చేస్తామని టీడీపీ సీనియర్ నేత, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు తెలిపారు. ఉదయం నుంచీ గ్రామస్థులతో కలసి గ్రామ పొలిమేరల్లో వెలసిన గ్రామదేవతలందరికీ పసుపుకుంకుమలు అందజేసి మధ్యాహ్నం పశువుల పండుగ నిర్వహించారు. రైతులంతా పశువులను ఒకచోటచేర్చి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆనవాయితీగా చేస్తున్న మరిడిమాంబకు పసుపు కుంకుమలు అందించారు. కార్యక్రమంలో కరెడ్ల ఈశ్వరరావుతోపాటు సర్పంచ్ రామలక్ష్మి, పెద్దలు జగన్నదొర, కాశీవిశ్వనాథ్, అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి జనసేనలో గుర్తింపు ఉంటుంది

బొబ్బిలి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ తమ్మిరెడ్డి శివ శంకర్ ను ఆదివారం బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తమ కార్యకర్తలతో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి జనసైనికుడు కష్టపడి పార్టీకోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పెద్దింటి మనోజ్ కుమార్, వీర మహిళలు, యువత పాల్గొన్నారు.

బొబ్బిలిలో రాస్తారోకో

బొబ్బిలి: అంబేడ్కర్‌ను, దళితులను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో మాల ఉద్యోగ సంఘ నాయకులు ఆకస్మికంగా రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యేలు రఘురామరాజు, వంతం నానాజీలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. వీరి ఆందోళన కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో రాస్తారోకో చేస్తున్న మాలమహానాడు నాయకులు



తక్షణమే వేతనాలు చెల్లించండి



నిరసనలో పాల్గొన్న ఆయాలు

గజపతినగరం: పాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు వేతనాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షురాలు వి. లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గల పాఠశాలలో ఆయాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న ఆయాలకు నెలకు రూ.6వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. 3 నెలలుగా ఆ వేతనాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయన్నారు. రామన్నపేట పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వెలగాడ జానకిని విధులకు రావద్దని సర్పంచ్... ఎమ్మెల్యేతో ఫోన్ చేయిస్తున్నారని ఎంఈఓ ఆయా చెప్పిందన్నారు. రాజకీయ వేధింపులు ఆగకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌరి, లీల, జానకి, మంగ, రోజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ


ఎమ్మెల్యే కళాతో డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి: స్థానిక డీఎస్పీ ఎస్.రాఘవులు ఆదివారం ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం రూరల్‌లో సీఐడీ విభాగంలో పనిచేసిన రాఘవులు బదిలీపై చీపురుపల్లి డీఎస్పీగా నియమితులైన విషయం తెలిసిందే. రాజాంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన డీఎస్పీ రాఘవరావు.. కళా వెంకటరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల సమస్యలు లేకుండా చూడాలని డీఎస్పీకి ఎమ్మెల్యే సూచించినట్టు తెలిసింది.

కొండపేటలో అన్నసమారాధన


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న సువ్వాడ వనజాక్షి

నెల్లిమర్ల: తూర్పు మహారాజుపేట (కొండపేట)లో 90 ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా గణపతి ఉత్సవాలు నిర్వహించడం అందరికీ ఆదర్శమని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి అన్నారు. వినాయక నిమజ్జన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన భారీ అన్నసమారాధనను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, జిల్లా మహిళా కార్యదర్శి లెంక హైమావతి, జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, బంగారు సరోజిని, రవ్వా నాని, మజ్జి రాంబాబు, చంటి, నేత్ర వైద్యుడు డాక్టర్ మంచు కుమారస్వామి, కమిటీ ప్రతినిధులు అల్తి శ్రీనివాసరావు, నడిపేన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలను దెబ్బ తీస్తున్న ప్రభుత్వం

గజపతినగరం: కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 3 నెలలకే రూ.50 వేల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. సంపద సృష్టించి.. రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టే బాధ్యత తీసుకుంటామన్న బాబు మాట ఏమైందని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే చిన్న చిన్న ఉద్యోగులపై రెడ్‌బుక్ అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూడి వెంకటరావు, బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛను పునరుద్ధరించరూ!


రాయివరపు కృష్ణ

గజపతినగరం: సాలిపేట గ్రామానికి చెందిన రాయివరపు కృష్ణకు 68ఏళ్లు... అతనికి గతంలో వృద్ధాప్య పింఛను వచ్చేది. కానీ ఆధార్ కార్డులో వయస్సు తక్కువ పడిందని...అందుకు పింఛనును నిలిపివేసినట్టు అధికారులు చెబుతున్నారని బాధితుడు ఆదివారం విలేకరుల ఎదుట వాపోయారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛను మంజూరైందని... వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2023లో పింఛను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి...పింఛనును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కృష్ణ కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో గౌరవం: ఎంపీ


కలిశెట్టిని సన్మానిస్తున్న సర్పంచ్‌ల సంఘ నాయకులు

రాజాం: జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘ ఆధ్వర్యంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సర్పంచ్‌లకు గౌరవం పెరగడంతో పాటు పంచాయితీల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు సర్పంచ్‌ల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ గౌరవ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు వానపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లు నడపాలి

విజయనగరం అమ్మవారి పండగకు ప్రత్యేక రైళ్లు వేయాలని విశాఖపట్నం డీఆర్ఎంను కోరినట్లు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. అమ్మవారి పండగకు భక్తులు భారీ స్థాయిలో హాజరవుతున్నందున ప్రత్యేక రైళ్లు వేయాలని కోరినట్లు తెలిపారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న వసంత గెడ్డ (ఫైల్)

- వర్షా కాలంలో ఉధృతంగా ప్రవాహం
- అత్యవసర వేళల్లో వీటిని దాటాల్సిందే
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- కానరాని వంతెనలు

మృత్యు గెడ్డలు

(గంట్యాడ)

మండలంలోని పలు గెడ్డలు ప్రమాదకరంగా మారాయి. ఇవి ప్రజల పాలిట మృత్యు గెడ్డలుగా తయారయ్యాయి. ఈ గెడ్డలను దాటేందుకు వంతెనలు లేకపోవడంతో అత్యవసర వేళ నీటిలో దిగుతున్నారు. వరద ఉధృతికి చాలామంది కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోతున్నారు. మండలంలోని చంద్రంపేట, లక్కిడాం, రామవరం, గింజేరు, తమురు, చిలకల గెడ్డలు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఈ గెడ్డల్లో నీటి ఉధృతి అధికంగా ఉంటుంది. ఎగువ నుంచి వచ్చిన వరద నీరు ఈ గెడ్డల ద్వారా సముద్రంలో కలుస్తుంది. ఈ సమయంలో అత్యవసరంగా వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే ఆ గ్రామాల ప్రజలు గెడ్డలు దాటాల్సిందే. ఈ పరిస్థితిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు ఉద్యోగులు గెడ్డ ఆవల ఉన్న గ్రామాలకు విధులు నిర్వహించడానికి వెళ్లే సమయంలో ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో వారు ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సిందే. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ప్రజల కష్టాలు తీరడం లేదు. ప్రధానంగా ఆరోగ్యం బాగోలేని సమయంలో గెడ్డలు దాటి ప్రయాణం చేయాలంటే వారు ఇక్కట్లు అన్ని ఇన్నికావు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఈ సమయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు హడావుడి చేసి తరవాత విడిచి పెడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ గెడ్డల వద్ద వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజల కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి

వసంత-చంద్రంపేట గ్రామాల మధ్య ఉన్న గెడ్డ వద్ద బ్రిడ్జి నిర్మించాలి. వర్షా కాలంలోని గెడ్డలోకి అధికంగా వరద నీరు వస్తుంది. ఈ సమయంలో గెడ్డ ఆవల ఉన్న తమ కళ్లాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. కొన్నిసార్లు ఇంటికి రాకుండా వారం రోజుల పాటు కళ్లా వద్ద ఉండి వంటలు చేసుకుని పశువులను కాపాడుకుంటున్నాం. వసంత గ్రామానికి చెందిన వారు బయటకు రావాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి గెడ్డపై వంతెనను నిర్మించాలి.

-బి.అప్పలనాయుడు, రైతు, చంద్రంపేట


చిలకగెడ్డ దాటేందుకు ఉద్యోగుల పాట్లు

- గంట్యాడ మండలం బుడతనాపల్లి సమీపంలో ఉన్న తమురుగెడ్డ వద్ద ఈనెల 25న రీల్స్ చేసేందుకు వచ్చిన గంట్యాడ గ్రామానికి ఆర్.పవన్ అనే విద్యార్థి కాలుజారి నీటిలో గల్లంతయ్యాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతున్న పవన్ తన స్నేహితులతో కలసి గెడ్డను చూసేందుకు వెళ్లాడు. గెడ్డలోకి నీరు అధికంగా రావడంతో రీల్స్ చేసేందుకు ప్రయత్నించి గల్లంతై ప్రాణాలు కోల్పోయాడు. గతంలో ఇదే గెడ్డలో ఓ వ్యక్తి మృతి చెందాడు.

- గంట్యాడ మండలం వసంత-చంద్రంపేట గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డలో ఈనెల 11న ఎల్.కోట మండలం చందులూరుకు చెందిన బత్తులు సతీష్ కొట్టుకుపోయాడు. సతీష్ తన అత్తవారి గ్రామం చంద్రంపేటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై గెడ్డ దాటేందుకు ప్రయత్నించాడు. అయితే, నాచువల్ల వాహనం జారిపోయి ఆయన గెడ్డలో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఇటువంటి ఘటనలు ఈ గెడ్డలో గతంలో కూడా చోటు చేసుకున్నాయి.

- తాటిపూడి రిజర్వాయర్ ఆవల ఉన్న చిలకల గెడ్డలో రెండేళ్ల కిందట ఓ గిరిజన గ్రామానికి చెందిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. వర్షాకాలంలో గిరిజన గ్రామాల ప్రజలు మైదానం ప్రాంతాలకు వచ్చేందుకు అత్యవసర పరిస్థితిలో చిలకల గెడ్డను దాడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

రామతీర్థంలో ఘనంగా పవిత్రోత్సవాలు


ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి పవిత్రోత్సవాలు మూడో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకులు బాలబోగం, తీర్థగోష్టి నిర్వహించారు. ఉదయం నుంచి పారాయణాలు, జపాలు, హవనాలు నిర్వహించారు. సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలకు అష్టకలశ స్నపన మహోత్సవాన్ని శాస్త్రోక్తగా నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీరామ చంద్ర స్వామి వారికి పవిత్రాల సమర్పణ, సాయంత్రం విశేష హోమాలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్, నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బాబోయ్.. కుక్కలు!

గ్రామాల్లో స్వైర విహారం


గజపతినగరంలో కుక్కల గుంపు

గజపతినగరం: గ్రామాల్లో శునకాల దాడులు... బాధితుల సంఖ్య పెరుగుతున్నాయి. తరచూ ఎక్కడో ఓ చోట కుక్కల దాడిలో ఎవరో ఒకరు గాయపడుతున్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గజపతినగరం పట్టణంతో పాటు పురిటిపెంట గ్రామ పంచాయితీలో కుక్కల బెడదతో జనం రాత్రి సమయాల్లో బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో కొన్నింటిని పట్టుకొని జనసంచారం లేని ప్రదేశాల్లో విడిచి పెడుతున్నారు. ఆ తరువాత సమీప ప్రాంతాల వారికి వీటితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుక్కల నివారణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

గీత కార్మికులకు ప్రాధాన్యమివ్వడం హర్షణీయం


మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు

విజయనగరం రింగురోడ్డు: మద్యం షాపుల్లో 10 శాతం కల్లుగీత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేటాయించడం హర్షణీయమని ఏపీ కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జమ్మాల అప్పారావు, సిమ్మా అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కేఎల్‌పురంలోని యూత్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ కల్లుగీత కార్మికులకు అనుకూలంగా ఇవ్వాలన్నారు. మద్యం షాపులు కల్లుగీత సొసైటీల ద్వారా ఇవ్వాలని కోరారు. కేరళ ప్రభుత్వం గీత కార్మికుల వృత్తిని రక్షించడమే కాకుండా తాటి, ఈత, కొబ్బరి ఉత్పత్తులను పరిశ్రమగా గుర్తించి 26 రకాల ఉత్పత్తులను తయారు చేసే విధంగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. అటువంటి విధానాన్ని ఇక్కడ అమలు చేయాలని కోరారు. కల్లుగీత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రతినిధులు కె.శ్రీనివాసరావు, యర్ని దేముడు, అప్పలస్వామి, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు


బంగార్రాజును సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

డెంకాడ (భోగాపురం): రాష్ట్రంలోని రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాల పంపిణీలో అన్ని జాగ్రత్తలు పాటిస్తామని.. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. ఆదివారం డెంకాడ గ్రామంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు ప్రదీప్ రాజు ఆధ్వర్యంలో రైతులు, గుణుపూరు, డెంకాడ, చందకపేట గ్రామాల జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కర్రోతును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకుంటానని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా నాణ్యమైన ఎరువులను సకాలంలో సరఫరా చేస్తామని... పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. వ్యవసాయ రంగంలో నూతన పద్ధతులకు వీలుగా రైతులకు సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల నాయకులు, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల బాధ్యత ప్రభుత్వానిదే


మాట్లాడుతున్న సత్యనారాయణ తదితరులు

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఏపీటీఎఫ్ (1938) మాస పత్రిక 'ఉపాధ్యాయ ప్రగతి' ముఖ్య సంపాదకులు జి.సత్యనారాయణ అన్నారు. అక్టోబరు 6 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఏపీటీఎఫ్ మహాసభల వేదిక ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వచ్చిన ఆయన ఆదివారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ, ప్రజాతంత్ర, కామన్ విద్యా విధానాన్ని అవలంబించాలని సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. విజయనగరం ఫూల్‌బాగ్ రోడ్డులోని జగన్నాథ కళ్యాణ మండపం (జె కన్వెన్షన్)లో అక్టోబరు 6, 7, 8 తేదీల్లో ఏపీటీఎఫ్ 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలు.. 80 వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐపీయూ ఉపాధ్యక్షులు వై.సత్యం, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యాయ ప్రగతి సంపాదక వర్గ సభ్యులు ఎ.ఎస్.నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.వెంకట్ నాయుడు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆర్.కృష్ణ, విజయనగరం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.పైడిరాజు, దత్తిరాజేరు మండల ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్, విజయనగరం మండల కమిటీ అధ్యక్షుడు సిహెచ్.పైడితల్లి, కె.పైడినాయుడు, పి.సీతారాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటా


విజయనగరం దాసన్నపేట: ఉపాధ్యాయులు, అధ్యాప కులకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఆదివారం తోటపాలెంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య అధ్యక్షతన ఉత్తరాంధ్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గాదే శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వానికి.. ఉపాధ్యాయ, అధ్యాపక వర్గానికి వారధిలా పని చేస్తానన్నారు. ఓపీఎస్ సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు గిరి ప్రసాదరెడ్డి, కరుణానిధిమూర్తి, గోపీనాథ్, భైరి గిరి, అప్పారావు, రవీంద్రనాయుడు, శ్రీనివాస్, రాంబాబు, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌ఛార్జి బంకపల్లి శివప్రసాద్ పాల్గొన్నారు.

బధిర విద్యార్థుల ఉపాధికి కృషి: ఏడీ

విజయనగరం దాసన్నపేట: బధిర విద్యార్థులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జగదీష్ అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బధిరుల సంఘం సంకేతభాష అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బధిరులు మాట్లాడుకునే సంకేత భాష వారికి వరంలాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మహేష్‌బాబు, గణపతి, మంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జంగిల్ క్లియరెన్స్!

- రూ.56 లక్షలతో ప్రతిపాదనలు
- ఏడు మండలాల్లోని రోడ్లకు మోక్షం


ఇటకర్లపల్లి మలుపు వద్ద పొదలు

చీపురుపల్లి: గ్రామీణ రహదారుల్లో ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. గజపతినగరం ఆర్ అండ్ బీ సబ్ డివిజన్ పరిధిలో ఈ పనుల కోసం అధికారులు రూ.56 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. సబ్ డివిజన్ పరిధిలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గజపతినగరం, మెంటాడ, బొండపల్లి, దత్తిరాజేరు మండలాల్లోని రోడ్లలో పొదలు పెరిగిపోయాయి. దీని కారణంగా వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా పొదలు పెరిగిపోవడం వల్ల దారి సక్రమంగా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎప్పటి నుంచో ఆ మండలాల్లోని ప్రజలు ఈ సమస్యపై గగ్గోలు పెడుతున్నారు. ప్రజా ప్రతినిధులు కూడా సమస్యను ఏకరువు పెడుతున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో అనేక చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులు తమ సొంత నిధులు వెచ్చించి.. జంగిల్ క్లియరెన్స్ చేయించారు. ఎట్టకేలకు స్పందించిన ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు అంచనాలు రూపొందించాల్సిందిగా కింది స్థాయి అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ 7 మండలాల్లోని అధికారులు స్థానిక రోడ్లకు రూ.34 లక్షలు, రాష్ట్రీయ రహదారులకు రూ.22 లక్షలతో పొదల తొలగింపునకు ప్రతిపాదనలు పంపించారు. తొలి ప్రాధాన్యం కింద ఈ రహదారులను ప్రతిపాదించినట్టు చీపురుపల్లి ఏఈఈ గోవిందరావు తెలిపారు. త్వరలో పనులు మంజూరు కావచ్చునని ఆయన అభిప్రాయ పడ్డారు.